సాక్షి సూర్యాపేట

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



యాదాద్రిలో భక్తుల రద్దీ

స్వాతి నక్షత్రం సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగింది. - 8లో



అవగాహన కల్పించాలి

ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని దేశీ కోర్స్ కన్సల్టెంట్ శ్రీమతి అరవింద అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
35°/15°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సుకన్య సమృద్ధి యోజన ఖాతాల్లో ముందంజ

నాగారం: సుకన్య సమృద్ధి ఖాతాలు తెరవడంలో సూర్యాపేట జిల్లా లక్ష్యాన్ని మించి ముందంజలో ఉందని తపాలా శాఖ జిల్లా సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా సూర్యాపేట డివిజన్ పరిధిలో సుకన్య సమృద్ధి యోజనపై ఈ నెల 9, 10 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1,615 ఖాతాలు తెరవాలని లక్ష్యంగా పెట్టుకోగా జిల్లాలోని పోస్టల్ సిబ్బంది సహకారంతో రెండు రోజుల్లో 1,652 ఖాతాలు తెరిచినట్లు తెలిపారు. దేశంలో ఏ పథకానికి లేని విధంగా సుకన్య సమృద్ధి యోజనకు 7.6శాతంతో ఆకర్షణీయమైన వడ్డీ లభిస్తుందన్నారు. ఆయనతో వెంట పోస్టల్ సిబ్బంది ఐపీఓ సురేష్, బీపీఎంలు జలాల్, నర్సయ్య, వెంకటయ్య, సత్యనారాయణ, లింగమల్లు ఉన్నారు.

వైభవంగా సౌరహోమం



మహా సౌరహోమంలో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని కనులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆతర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్రంలో సూర్యభగవానుడి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్ రెడ్డి, కర్నాటి నాగేశ్వరరావు, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాల శర్మ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

తెలంగాణలో కుటుంబ పాలన



పాదయాత్రలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన సాగుతోందని, రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామం నుంచి పిన్నాయిపాలెం, జేతుతండా మీదుగా సపావత్ తండా వరకు హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాదయాత్రకు వస్తున్న స్పందనను చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గట్టు శ్రీనివాస్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు ధరావత్ వెంకన్న, షఫిఉల్లా, స్వామి నాయుడు, ప్రవీణ్, ఫరూక్, సైదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, కుప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాదగోని కృష్ణ, జెర్రిపోతుల అంజయ్య, వెంకన్న, రఘు, సతీష్, రవీందర్, వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం



పుస్తకాలను అందిస్తున్న సంస్థ సభ్యులు

భానుపురి : బాలికా విద్యతో సమాజాభివృద్ధి సాధ్యమనిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ వ్యవస్థాపకుడు, చంచల్‌గూడ సెంట్రల్ జైల్ ఎస్పీ నవాబ్ శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రూప్–4 పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. పోటీ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు తమ వంతు సహాయంగా మెటీరియల్ అందజేసిన సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ సభ్యుడు, చంచల్‌గూడ సెంట్రల్ జైలు సీనియర్ అసిస్టెంట్ మంచాల గోపికృష్ణ, కౌన్సిలర్ నిమ్మల స్రవంతి శ్రీనివాస్ గౌడ్, మానసిక నిపుణులు పూర్ణ శశికాంత్, లైబ్రేరియన్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

• కొత్తగూడెంలో 'సైబీరియన్' సందడి



తుంగతుర్తి మండలం కొత్తగూడెంలో సైబీరియన్ కొంగలు సందడి చేస్తున్నాయి. యూరప్ ఖండంలోని సైబీరియా ప్రాంతానికి చెందిన వందలాది కొంగలు వేలాది కిలోమీటర్లు ప్రయాణించి ఏటా డిసెంబర్ మాసంలో ఈ గ్రామానికి రావడం ఆనవాయితీ. ఈ ఏడాది మాత్రం రెండు నెలలు ఆలస్యంగా గ్రామానికి వచ్చాయి. ప్రస్తుతం గ్రామంలోని చెరువుల శివారులో ఉన్న ఎత్తయిన చింత, తుమ్మ, వేపచెట్లపై తమ గూళ్లు నిర్మించుకుంటున్నాయి. వీటిని గ్రామస్తులు చూసి ఆనందపడుతున్నారు.

– తుంగతుర్తి

వక్ఫ్ భూములు మాయం!

జిల్లాలో 3,014 ఎకరాలకు 95శాతం పరాధీనం

- మిగిలింది కేవలం ఐదుశాతం భూములే..
- ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- వక్ఫ్ బోర్డుకు ఒకేఒక్క అధికారి ఉండడంతో కరువైన పర్యవేక్షణ
- ఎన్ని భూములున్నాయో తహసీల్దార్ కార్యాలయాల్లోనూ లభించని వివరాలు



వక్ఫ్ భూములను కాపాడాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రెవెన్యూ, వక్ఫ్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం, సబ్ రిజిస్ట్రార్ల కాసుల కక్కుర్తికి జిల్లాలో కోట్లాది రూపాయల విలువైన వక్ఫ్ భూములు మాయమైపోయాయి. ఒకటి రెండు కాదు.. ఏకంగా వేలాది ఎకరాల భూములు పరాధీనం అయ్యాయి. వక్ఫ్ భూముల పరిరక్షణకు జిల్లాలో ఒకేఒక్క అధికారి ఉండటానికి తోడు..రెవెన్యూ అధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో వేలాది ఎకరాలు భూములు అక్రమార్కుల పాలయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా 3,014 ఎకరాలు

జిల్లాలోని మూడు (సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్) రెవెన్యూ డివిజన్ల పరిధిలో గల 23 మండలాల్లో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములు 3,014 ఎకరాలు ఉన్నట్లు రికార్డుల్లో నమోదైంది. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మాత్రం వీటిలో కేవలం 5శాతం భూములు మాత్రమే మిగిలినట్లు తెలుస్తోంది. జిల్లా అంతటికీ ఒక్కరే ఇన్‌స్పెక్టర్ ఉండటంతో ఆక్రమణలను అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. తమ మండలాల పరిధిలో ఏయే సర్వే నంబర్లలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వక్ఫ్ భూములు ఉన్నాయనే వివరాలు సైతం కొన్ని రెవెన్యూ కార్యాలయాల్లో లభించని దుస్థితి. ఇక ఆక్రమణలపై పోలీసుల దగ్గర నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేస్తున్నా వారినుంచి ఎలాంటి స్పందన లేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు.

సీబీసీఐడీ విచారణ ఏమైనట్లు..

జిల్లాలో వక్ఫ్ బోర్డు భూముల పరాధీనంపై గతంలో అనేకమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. వక్ఫ్ భూములను పరిరక్షించాలని మైనార్టీ సంఘాలు, ఆవాజ్ కమిటీ నాయకులు అనేక పర్యాయాలు ప్రభుత్వానికి విన్నవించారు. 2022 అసెంబ్లీ సమావేశాల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షిస్తామని, సీబీసీఐడీతో విచారణ చేపట్టి అక్రమార్కుల నుంచి భూములను కాపాడుతామని హామీ ఇచ్చారు. ఇందులో 2022 జూన్, జూలైలో సీబీసీఐడీ అధికారులు జిల్లాలో పర్యటించి విచారణ చేపట్టారు. కాని నేటికీ ఆ వివరాలను బహిర్గతం చేయకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదు.

ఆక్రమణకు గురైన వాటిలో మచ్చుకు కొన్ని..

- జిల్లా కేంద్రానికి నడిబొడ్డున ఇందిరమ్మ ఆస్పత్రి దగ్గరలో ఉన్న 1.33 ఎకరాల వక్ఫ్ బోర్డు ఆక్రమణ గురైంది.
- సూర్యాపేట మండలం బాలెంలలో 4 ఎకరాలు, ఎల్కారంలో 10 ఎకరాలు, కాసరబాదలో 3 ఎకరాల వక్ఫ్ భూములు మాయం అయ్యాయి.
- ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూరులో 18 ఎకరాలు, నెమ్మికల్‌లో 6.34 ఎకరాలు, బొప్పారంలో 5.20 ఎకరాలు, ఆత్మకూర్‌లో 2.20 ఎకరాలు, ఏనుబాములలో 6 ఎకరాల వక్ఫ్ భూములు ఇతరుల ఖబ్జాలోకి వెళ్లాయి. ఇలా జిల్లాలోని ప్రతి మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది.

ఎట్టకేలకు అల్పాహారం



చిలుకూరు హైస్కూల్‌లో స్టడీ అవర్స్‌కు హాజరైన టెన్త్ విద్యార్థులు

- టెన్త్ విద్యార్థులకు తీరనున్న ఆకలి బాధలు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- 15 నుంచి అమలు కానున్న కార్యక్రమం
- 8,230మందికి ప్రయోజనం

చిలుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఆకలి బాధలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో వంద శాతం ఫలితాల సాధన కోసం మూడు నెలలుగా ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు అన్ని పాఠశాలల్లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీటికి హాజరయ్యే గ్రామీణ విద్యార్థులు అర్ధాకలితో చదువులు కొనసాగిస్తున్నారు. ఉదయం పూట ఆదరాబాదరగా వస్తున్న విద్యార్థులు మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నం తిని సాయంత్రం 5.30 గంటల వరకు బడిలోనే ఉండాల్సి రావడంతో నీరసించి పోతూ చదువుపై ఏకాగ్రత పెట్టలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల పరిస్థితిని గమనించిన ప్రభుత్వం వీరందరికీ సాయంత్రం పూట అల్పాహారం అందించేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ నెల 15 నుంచి ఈ కార్యక్రమం అమలు చేయాలని సమగ్ర శిక్షణ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు.

రూ.41.97 లక్షల నిధులు

జిల్లా వ్యాప్తంగా 229 జిల్లా పరిషత్ పాఠశాలల్లో మొత్తం 8,230 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 1 వరకు 34 రోజులు పనిదినాల్లో అల్పాహారం అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున మొత్తం 41,97,300 నిధులను విడుదల చేసిన ప్రభుత్వం వాటితో విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఈ నిధులు ఎస్ఎంసీ ఖాతాల్లో జమచేయనున్నారు. విద్యార్థులకు అందించబోయే అల్పాహారానికి సంబంధించి మెనూ రూపొందించనున్నారు.

15 నుంచి అల్పాహారం అందిస్తాం



జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. వీటికి హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజురు చేసింది. ఈ నెల 15 నుంచి అల్పాహారం అందిస్తాం.

– అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట

మట్టపల్లిలో నారసింహుడి కల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి దేవాలయంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు నిర్వహించి వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి,ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భానుపురి : ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు గండూరి కృపాకర్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రమేష్ చంద్ర, జూనియర్ చాంబర్ ప్రెసిడెంట్ గుండా సతీష్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో గండూరి జానకమ్మ ఉచిత వాటర్ ప్లాంట్ వద్ద ఉచితంగా షుగర్, కొలెస్ట్రాల్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మన చుట్టూ ఉన్న పరిసరాల్లో ఉండే అపరిశుభ్రత, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆహారంలో మసాలాలు, కారం అధికంగా తినడం వల్ల కూడ ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. డయాబెటిస్, కొలెస్ట్రాల్ వంటి వ్యాధుల నిర్ధారణకు పద్మశాలి యువజన సంఘం సభ్యుల ఆలోచన మేరకు లయన్స్ క్లబ్, జూనియర్ చాంబర్ సహకారంతో పట్టణంలోని పలు వార్డుల్లో ప్రతి ఆదివారం ఉచితంగా బ్లడ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిశిక వీరయ్య, నూకల వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ ట్రెజరర్ రాచకొండ శ్రీనివాస్, సెక్రటరీ యాదా కిరణ్, మిట్టపల్లి రమేష్, ముప్పారపు విద్యాసాగర్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు మిట్టకోల యుగంధర్, పున్నం వెంకన్న, వావిల్దాస్ జగదీష్, దూలం నగేష్, లతీఫ్, నామా వేణు, కస్తూరి నవీన్, కుక్కడపు సాలయ్య, భిక్షం, కళ్యాణ్, సందీప్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలేవీ?

- గతంలో స్కూళ్లలో 'ఆర్‌బీఎస్‌కే'
- ప్రస్తుతం దాని ఊసెత్తని అధికారులు
- దృష్టి లోపాలతో బాధపడుతున్న పాఠశాలల చిన్నారులు
- కంటి వెలుగు శిబిరాల్లో అవకాశం కల్పించాలని వేడుకోలు



తిరుమలగిరి(తుంగతుర్తి): గత నెల 19నుంచి జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కింద 18 సంవత్సరాలు నిండిన వారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. దృష్టి లోపాలు ఉన్నవారికి కళ్లద్దాలను పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా కంటి పరీక్షలు నిర్వహించాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే గతంలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు సాధారణ కంటి పరీక్షలు చేసేవారు. ప్రస్తుతం ఆ కార్యక్రమం ఊసేలేకుండా పోయింది. దీంతో జిల్లాలో వేలాది మంది విద్యార్థులు దృష్టిలోపాలతో బాధపడుతూనే తమ చదువులు కొనసాగిస్తున్నారు. 25 రోజుల నుంచి కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలకు పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థులను అనుమతిస్తే వారికి కూడా ప్రయోజనం చేకూరనుంది.

బాలబాలికల్లో దృష్టి లోపం అధికమే..

విద్యార్థుల్లో దృష్టి లోపాలు అధికంగా ఉంటాయి. వీరు తల్లిదండ్రులకు చెప్పక పోవడం, దృష్టి లోపాలు గుర్తించక పోవడంతో సమస్య తీవ్రమవుతుంది. పాఠశాల, ఇంటర్ కళాశాలల్లో బ్లాక్ బోర్డుపై అక్షరాలు కనిపించని బాల బాలికలు ప్రతి క్లాస్‌లో పదికి పైగానే ఉంటారు. పాఠశాల స్థాయిలో గతంలో (కోవిడ్ సమయంలో) 2వేల మందికిపైగా దృష్టి లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోవిడ్ తరువాత ఈ సంఖ్య మరింత పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పోషకాహార లోపం వల్ల కూడా విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారు. ప్రైవేట్‌గా పరీక్షలు చేయించుకొని కళ్లద్దాలు తీసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.2వేల వరకు ఖర్చవుతుంది. కంటి వెలుగు కార్యక్రమంలో వీరిని చేర్చడం ద్వారా ఆ భారాన్ని తగ్గించవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోర్టల్‌ను సరి చేసి..

18 ఏళ్ల పైబడిన వారికి మాత్రమే ఉపయోగపడేలా ఈ పోర్టల్‌ను రూపొందించడంతో అంతకంటే చిన్న వయస్సు వారిని అందులో నమోదు చేయడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రూపొందించిన పోర్టల్‌ను సరి చేసి విద్యార్థులకు సైతం అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులకు అవకాశం కల్పించాలి




పాఠశాల, కళాశాల విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారు. ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమంలో విద్యార్థులకు సైతం ఉచితంగా పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేయాలి.

– సీహెచ్ సోమయ్య, హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల, వెలిశాల, తిరుమలగిరి మండలం

333 మంది టీచర్లకు ఊరట

- 317 జీఓ ప్రకారం గతంలో బదిలీ అయిన వారికి చాన్స్
- కోర్టు తీర్పుతో ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్లకు అవకాశం
- ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- 15వ తేదీ వరకు పరిశీలన ప్రక్రియ



సూర్యాపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయులకు చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుండగా 317జీఓ కింద గతంలో బదిలీ అయిన టీచర్లకు కోర్టు జోక్యంతో ఊరట లభించింది. 317 జీఓ ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి చాలామంది ఉపాధ్యాయులను విభజించి వివిధ జిల్లాలకు కేటాయించిన విషయం విదితమే. ఆ ఉపాధ్యాయులు పాత జిల్లాలో పనిచేసిన సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాలో పాయింట్ల ఆధారంగా బదిలీకి అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలో 333 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చింది.

సర్వీస్ ఆధారంగా..

అన్ని జిల్లాలకు జనాభా ప్రాతిపదికన ఉద్యోగ, ఉపాధ్యాయులను కేటాయించాలని గతేడాది డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీఓ 317 కింద సర్దుబాటు ప్రక్రియ చేపట్టింది. ఇందులో చాలామంది ఉపాధ్యాయులు పొరుగు జిల్లాకు వెళ్లారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసినవారు మాత్రమే తాజాగా చేపడుతున్న బదిలీలకు అర్హులుగా పేర్కొనడంతో వీరికి బదిలీ అవకాశం లేకుండా పోయింది. రెండేళ్ల సర్వీస్ పూర్తయినవారు గతనెల 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా విద్యాశాఖ అధికారులు స్వీకరించారు. అయిత జీఓ 317 ప్రకారం గతంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో న్యాయస్థానం తీర్పుతో ఉపాధ్యాయులకు కొంత ఉపశమనం లభించింది. అలాగే ప్రభుత్వం బదిలీ ప్రక్రియను ఆపేసి కొత్త షెడ్యూల్ జారీ చేసింది.

14 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

జీఓ 317 ఉపాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనుంది. పరిశీలన ప్రక్రియ ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనుంది. వెరిఫికేషన్‌కు వచ్చే క్రమంలో హెచ్‌ఆర్‌ఏ కేటగిరీ, ఎల్‌పీసీ కాపీ, ప్రాధాన్యత ధ్రువీకరణ పత్రాలు, జీఓ 317 అలాట్‌మెంట్ ఒరిజినల్ కాపీలు వెంట తెచ్చుకోవాల్సి ఉంటుందని సవరించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వం పేర్కొంది.

కొత్త షెడ్యూల్ ఇలా..

గతంలో విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 4వ తేదీతో బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. తాజాగా హైకోర్టు తీర్పు నేపథ్యంతో సవరించిన షెడ్యూల్‌తో మార్చి 14వ రకు కొనసాగనుంది. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జీఓ 317 ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, 15న పరిశీలన, 21, 22వ తేదీల్లో సీనియారిటీ జాబితా ప్రకటన, 24వ తేదీన ప్రధానోపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు, 26, 27, 28వ తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 4, 5 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీ, మార్చి 7, 8, 9వ తేదీల్లో ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి, మార్చి 14న ఎస్‌జీటీలకు బదిలీలు, మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు డీఈఓలు, ఆర్‌జేడీల ఉత్తర్వులపై అభ్యంతరాల సమర్పణ ఉంటుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

చెస్ పోటీలకు విశేష స్పందన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కోదాడ అర్బన్: విజన్ చెస్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కోదాడలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ –15 చెస్ పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజన్ కోచింగ్ సెంటర్ కోచ్ అంజయ్య మాట్లాడుతూ అండర్ –7, 9, 11, 13, 15 కేటగిరీల్లో బాల బాలికలకు కూడా వేర్వేరుగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతి కేటగిరీలో బాలబాలికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసినట్లు తెలిపారు. చదరంగంతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు కూడా విద్యార్థులకు నిర్వహించారు. చదరంగంలో నిత్య సాధన ద్వారా మానసిక వికాసం కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు బాల్యం నుంచే పిల్లలకు చదరంగంలో శిక్షణ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెఫరీలు దిలీప్, నర్సింహారావు, క్రాంతికుమార్, నరేష్, దేవా, త్రివేణి, రామారావు, రజని తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ఆదివారం ఆలయంలో శతఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతంతో స్వామివారిని కొలిచారు. అనంతరం స్వాతి హోమం నిర్వహించారు. ఆ తర్వాత ముఖ మండపంలో బంగారు, వెండి కలశాలలో వివిధ ఫలామృతాలు, సుగంధ ద్రవ్యాలు నింపి పూజలు చేసి వాటితో శ్రీస్వామి, అమ్మవారిని అభిషేకించారు. ఇక ఆలయంలో సహస్ర నామార్చన, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు చేపట్టారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగూడూరు: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలోఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు గ్రామానికి చెందిన దాసరి వెంకటయ్య కుమారుడు దాసరి సతీష్(30)కు పది సంవత్సరాల క్రితం దేవరప్పుల గ్రామానికి ఉమతో వివహం జరిగింది. మూడు సంవత్సరాలుగా భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో భార్య ఉమ తన తల్లిదండ్రులు వద్దనే ఉంటుంది. సంతీష్ కుటుంబ కలహాలతో మస్తాపానికి గురై ఆదివారం ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు గమనించే లోపే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

మంత్రాలయం రూరల్: గుండెపోటుతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన తిరుపతయ్య కుమారుడు సైదులు ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రయాణికులతో మంత్రాలయం చేరుకున్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జీపీఎస్ రెసిడెన్సీలో బస చేయగా డ్రైవర్ సైదులులో టెంపో ట్రావెలర్‌లో నిద్రపోయాడు. తెల్లవారుజామున సైదులు (45)కు గుండెపోటు రావడంతో వాహనంలోనే కన్నుమూశాడు. ఉదయం గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మంత్రాలయం చేరుకుని మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా సామగ్రి

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని హైటెక్ కాలనీలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రోడ్డులో హైటెక్ కాలనీలో నివాసం ఉంటున్న పసునూరి సుధాకర్ కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్లారు. ఆదివారం ఇంటికి తిరిగి రాగా ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి.బీరువాలో దాచిన 15వేల నగదు , 2తులాల బంగారం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉండ్రుగొండలో ముగిసిన పవిత్రోత్సవాలు

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజులో భాగంగా స్వామివారి శాంతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ గోపురం, శిఖర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, బలిహరణం, నవకలశ స్నపనం, అభిషేకం, యాగశాలలో శాంతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం కృష్ణకుమార్, శ్రీమాన్ అరుట్ల రవికుమార్ చార్యులు, కృష్ణమాచార్యులు, డాక్టర్ రామ య్య, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ



ప్రధానాలయంలో భక్తుల కోలాహలం



ప్రధానాలయ వీధుల్లో భక్తుల సందడి

- శ్రీనృసింహుడిని దర్శించుకున్న 35వేల మందికిపైగా భక్తులు

యాదగిరిగుట్ట : వరుస సెలవులు రావడంతో పాటు స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. జంట నగరాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రం, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట వంటి ప్రాంతాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ఇక శ్రీస్వామి వారిని 35వేల మందికి పైగా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వివిధ పూజలతో..

యాదాద్రికి నిత్య ఆదాయం రూ.48,81,724 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ప్రధాన బుకింగ్‌తో రూ.6,61,800, కై ంకర్యాలతో రూ.4,600, సుప్రభాతంతో రూ.9,900, పుష్కరిణితో రూ.1,200, వ్రతాలతో రూ.2,04,800, ప్రచార శాఖతో రూ.20,500, వీఐపీ దర్శనాలతో రూ.3,97,500, యాదరుషి నిలయంతో రూ.1,54,082, ప్రసాద విక్రయంతో రూ.19,07,450, పాతగుట్ట ఆలయంతో రూ.80,460, కల్యాణ కట్టతో రూ.1,47,500, శాశ్వత పూజలతో రూ.30,000, వాహన పూజలతో రూ.19,400, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6,00,000, సువర్ణ పుష్పార్చనతో రూ.1,43,380, వేద ఆశీర్వచనంతో రూ.26,400, శివాలయంతో రూ.10,300, అన్నదానంతో రూ.52,652, బ్రేక్ దర్శనాలతో రూ.3,99,300, ఇతర పూజలతో రూ.10,500 వచ్చినట్లు వివరించారు.



నిత్యకల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు



క్యూ లైన్‌లలో బారులుదీరిన భక్తులు

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

కేతేపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాసగృహం దగ్ధమై రూ.2లక్షల నష్టం సంభవించింది. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడ గ్రామంలోని జంగాల కాలనీకి చెందిన ఎదురుగట్ల వెంకట్రాములు బొగ్గుబట్టీల కోసం అవసరమైన కట్టెలు కొట్టే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి వెంకట్రాములు తన భార్య, పిల్లలతో కలసి పూరి గుడిసె అయిన తన నివాస గృహంలో నిద్రిస్తుండగా తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గుడిసెకు నిప్పంటుకుంది. మంటలు గమనించిన వెంకట్రాములు కుటుంబంతో కలసి కేకలు వేస్తూ ఇంటి నుంచి బయటికి వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇరుగు పొరుగు వారితో కలసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు కాకపోవటంతో నకిరేకల్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు.



గుడివాడ గ్రామంలో దగ్ధమవుతున్న పూరి గుడిసె

ఫైర్ సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకుని మంటలు ఆర్పినప్పటికీ పూరి గుడిసె పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో ఇంట్లో ఉంచిన రూ.40వేల నగదు, రెండు తులాల బంగారంతో పాటు, బట్టలు నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని, కట్టుబట్టలతో మిగిలామని బాధితుడు వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడి చొరవతో బాలుడి ఆచూకీ లభ్యం

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వ ఉపద్యాయుడి చొరవతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ లభ్యమైన ఘటన ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. డీఎస్పీ వెంకటగిరి, వన్‌టౌన్ సీఐ రాఘవేందర్, ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాలుడు ఆదివారం ఉదయం 7గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. బాలుడి తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సామాజిక మాధ్యమాల్లో వివరాలు ఉంచి గాలింపు చెపట్టారు. ఈ క్రమంలో బాలుడు నల్లగొండలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకన్న కారులో లిఫ్ట్ అడిగి కొంతదూరం ప్రయాణించి ఒక చోట దిగాడు. బాలుడి ప్రవర్తన అనుమానంగా ఉండటంతో కొద్ది దూరం బాలుడిని అనుసరించిన ఉపాధ్యాయుడిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. అనంతరం బాలుడిని తన వెంట ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులు వచ్చాక అప్పగించాడు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంపోడు : మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 15 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 13 మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. బాలికల కోసం మిర్యాలగూడెం, నల్లగొండ, నకిరేకల్, కోదాడ, హుజూర్‌నగర్, ఆలేరులలో పాఠశాలల్లో ఐదవ తరగతిలో 80 సీట్లు, కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఒక్కో కళాశాలలో 80 సీట్లు ఉన్నాయి. బాలుర కోసం దేవరకొండ, నల్లగొండ, అనుముల, సూర్యాపేట, తుంగతుర్తి, భువన గిరి, చౌటుప్పల్‌లో పాఠశాలల్లో 80 సీట్లు, ఒక్కో కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 80 సీట్లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని వారు నేరుగా పాఠశాలలకు వెళ్లి ప్రిన్సిపాల్‌కు కూడా దరఖాస్తులు అందించవచ్చునని తెలిపారు. ఇంటర్ ప్రవేశాలకు పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో www. tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో, ఆఫ్‌లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సీట్ల కేటాయింపు ఇలా..

మొత్తం 80 సీట్లలో ముస్లిం మైనార్టీలకు 51సీట్లు, క్రిస్టియన్ మైనార్టీలకు 5 సీట్లు, పార్శీలు, బౌద్ధులు, సిక్కులకు ఒక్కో సీటు, నాన్ మైనార్టీ కోటాల్లో ఎస్సీలకు 5, ఎస్టీలకు మూడు, బీసీలకు 10, ఓసీలకు 2 చొప్పున సీట్లు కేటాయిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాలు సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 13 పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లకు ఈ నెల 15 వ తేదీ చివరి తేదీ. అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనతోపాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి

ఎస్‌వీఆర్ లేబొరేటరీస్‌లో అగ్ని ప్రమాదం

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దోతిగూడెం గ్రామంలోని ఎస్‌వీఆర్ లేబొరేటరీస్‌లో ఆదివారం మధ్నాహం ఏ బ్లాక్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే కార్మికులు, సిబ్బంది అప్రమత్తంమై ఫైరింజన్ సహాయంతో మంటలార్పడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో కంపనీలోని ఏ బ్లాక్‌లో గల రియాక్టర్‌లోనికి టోలిన్ అనే సాల్వెంట్‌ను లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు కార్మికులు భయంతో కేకలు వేస్తూ బయటికి పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన కంపనీ యాజమాన్యం కంపనీలో గల అగ్నిమాపక పరికరాలతో పాటు ప్రక్కనే ఉన్న హెజెలో లాబోరేటిస్ చెందిన ఫైర్ ఇంజిన్‌ను తెప్పించి మంటలార్పారు. అలాగే చౌటుప్పలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చేలోపు మంటలార్పారు. సమాచారం అందుకొన్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అక్కడ విధులు నిర్వహించిన కార్మికులను అడిగితెలుసుకొన్నారు. అయితే మంటలు ఏలా వచ్చాయని విచారణలో తేలుతుందని ఎస్ఐ బాద్యానాయక్, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాగా కంపనీ యాజమాన్యం అప్రమత్తంగా వ్యవహరించడం తోనే ప్రాణ, ఆస్థినష్టం జరగలేదు. అయితే గతంలో కూడ సరైన భద్రత, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఇలాగే అగ్ని ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా భద్రత నియమాలను పాటించాలని కోరుతున్నారు.



మంటలార్పుతున్న ఫైర్‌సిబ్బంది



ప్రమాదం సంభవించిన రియాక్టర్ ఇదే



కార్మికులను విచారిస్తున్న పోలీసులు

ఇద్దరిపై కేసు

రామగిరి(నల్లగొండ): ఇరు వర్గాల ఘర్షణలో ఇద్దరిపై తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పల్లె మైసయ్య ఇంటి ఎదురుగా ఉన్న పల్లె లావణ్య ఇంటి ముందు మోరీ నుంచి తీసిన చెత్త వేశాడు. ఇదేంటడి లావణ్య అడిగింది. పల్లె మైసయ్య అతని భార్య మంజులకు పల్లె లావణ్య సోదరుడు మహేష్‌కు తీవ్ర గొడవ జరిగింది. ఈ గోడవలో లావణ్య అతని సోదరుడు మహేష్‌పై మైసయ్య మంజుల దాడి చేశారు. పల్లె లావణ్య తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆదివారం పల్లె మైసయ్య మంజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం

- భర్తకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- మాడ్గులపల్లి మండల పరిధిలో ఘటన

మిర్యాలగూడ: రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామ శివారు అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం ఈదులగూడేనికి చెందిన దైద వెంకన్న సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో నల్లగొండలోని గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న తమ కూతురు కావ్యశ్రీను చూసేందుకు భార్య లక్ష్మణరేఖ(37)తో కలిసి బైక్‌పై మిర్యాలగూడ నుంచి బయలుదేరారు. కాగా మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులోకి రాగానే అతివేగంగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై లక్ష్మణరేఖ అక్కడికక్కడే మృతిచెందగా వెంకన్న తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నరేష్‌లు లక్ష్మణరేఖ మృతదేహాన్ని, తీవ్రంగా గాయపడిన వెంకన్నను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకన్నను పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. మృతురాలి అక్క లోకేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



లక్ష్మణరేఖ (ఫైల్)

పేద రోగులకు వరం

విస్తరిస్తున్న డయాలసిస్ సేవలు

- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కేంద్రం ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి
- ఇప్పటికే ఆలేరు, చౌటుప్పల్‌లో అందుబాటులోకి..
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తీరనున్న ఇబ్బందులు



డయాలసిస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పడకలు

భువనగిరి : కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడే వారికోసం జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో ఎంతో ఖర్చుతో కూడుకున్న డయాలసిస్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇప్పటికే చౌటుప్పల్, ఆలేరు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ల ద్వారా ఉచిత సేవలు అందజేస్తుండగా ఇకనుంచి భువనగిరిలోనూ అందనున్నాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

ఐదు పడకలతో డయాలసిస్ సెంటర్

ఉస్మానియా ఆస్పత్రి హబ్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న 23 డయాలసిస్ కేంద్రాల్లో భాగంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ ఏర్పాటు చేశారు.దీని కోసం రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇందులో ఐదు పడకలు, ఐదు డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి హెచ్ఐవీ బాధితులకు, మిగితావి సాధారణ కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం కేటాయించారు. ఒక ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని శుద్ధి చేయడం ద్వారా చికిత్స నిర్వహించనున్నారు. ఒక్కొక్కరికి నాలుగు గంటల సమయం పట్టనుంది. రోజూ 20 నుంచి 25 మంది కిడ్నీ బాధితులకు వైద్య సేవలు అందజేస్తారు.సెంటర్‌లో మొత్తం 8 మంది సిబ్బంది ఉంటారు. ఒకరు డేటా ఎంట్రీ ఆపరేటర్,7గురు టెక్నీషియన్లు విధులు నిర్వహిస్తారు. ఉస్మానియా ఆస్పత్రికి చెందిన నెఫ్రాలజీ డాక్టర్, జిల్లా కేంద్ర వైద్యశాలకు చెందిన జనరల్ ఫిజీషియన్ సేవలందిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఈ సెంటర్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందినున్నాయి. భువనగిరి పట్టణంతో పాటు పరిసర, జిల్లాలోని ఇతర ప్రాంతాల వారు డయాలసిస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– చిన్ననాయక్, డీసీహెచ్ఎస్

తీరనున్న ఇబ్బందులు

జిల్లాకు చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తులు చికిత్సకోసం హైదరాబాద్, వరంగల్ నగరాలకు వెళ్లేవారు. దీంతో వారు వ్యయప్రయాసలకు గురయ్యేవారు. విలువైన వైద్యం కావడంతో ఆర్థికస్థోమత లేక పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం చౌటుప్పల్, ఆలేరు ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు అందుతుండడంతో స్థానికులు, పరిసర మండలాల బాధితులు అక్కడే చికిత్స పొందుతున్నారు. నేటి నుంచి భువనిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ డయాలసిస్ సేవలు ప్రారంభంకానుండడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే బాధలు తప్పనున్నాయి.

బేతవోలులో ముగిసిన ఎడ్ల పందేలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో కనకదుర్గ జాతర సందర్భంగా పశు ప్రదర్శన, గ్రామ సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీలు వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పందేలు ఆదివారం రాత్రి ముగిశాయి. పోటీల్లో గుంటూరు జిల్లా రాజుపాలెం మండలానికి చెందిన కటికం వెంకటేశ్వర్లు ఎడ్లు ప్రథమ బహుమతి, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు ద్వితీయ బహుమతి, సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఏఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డికి చెందిన ఎడ్లు తృతీయ బహుమతి, పల్నాడు జిల్లా అమరావతికి చెందిన బండ్ల సాయి శ్రీ భవనకు చెందిన ఎడ్లు నాల్గొవ బహుమతిని సాధించాయి. గెలుపొందిన విజేతలకు ఎడ్ల యాజమానులకు బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కె.శశిధర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, సర్పంచ్ వట్టికూటి చంద్రకళనాగయ్య, ఎంపీటీసీలు వట్టికూటి ధనమూర్తి, సైదాబాబు పాల్గొన్నారు.




ఎడ్ల పందేలలో బండ లాగుతున్న ప్రథమ బహుమతి సాధించిన గుంటూరు ఎడ్లు

ఎమ్మెల్సీ చాన్స్ ఎవరికి?

హామీ దక్కిన వారికా.. కొత్త వ్యక్తులకా?

- మార్చిలో ముగియనున్న ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం
- జిల్లా బీఆర్ఎస్ నేతల్లో పదవి టెన్షన్
- సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్ద ప్రయత్నాలు



సాక్షి, యాదాద్రి : ఎమ్మెల్సీ పదవి కోసం జిల్లా బీఆర్ఎస్‌లో కోలాహలం మొదలైంది. శాసనసభ్యుల కోటాలో ఎన్నికైన ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం మార్చి 29న ముగియనుంది. ఈ నేపథ్యంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే అధినేత కేసీఆర్ ఇప్పటికే పలువురికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు వారికే ఇస్తారా లేక కొత్తవారికి అవకాశం కల్పిస్తారా అన్నది చర్చనీయాంశమైంది.

ఎవరి ప్రయత్నాల్లో వారు

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు ఎలిమినేటి కృష్ణారెడ్డికి ఆరేళ్ల క్రితం శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ పదవి దక్కిన విషయం తెలిసిందే. వచ్చేనెల ఆయన పదవీకాలం ముగియనుండడంతో ఆశావహులు ఆ సీటుపై కన్నేశారు. ఈ దఫా తమకు అవకాశం కల్పించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి ద్వారా కొందరు ప్రయత్నిస్తుండగా.. మరికొందరు నేరుగా అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వేడుకుంటున్నారు.

తమకే వస్తుందన్న ధీమా

అధినేత కేసీఆర్ వివిధ ఎన్నికల సందర్భంగా పార్టీలోని పలువురు ముఖ్య నేతలకు పదవుల విషయంలో హామీ ఇచ్చినట్లు ప్రచారం ఉంది. దీంతో వారు ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మునుగోడు ఉప ఎన్నిక సమయంలో బీజేపీలో చేరారు. ఈ భర్తీని పూడ్చేందుకు బీజేపీలో ఉన్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ను పార్టీ పెద్దలు రాత్రికిరాత్రి ఒప్పించి కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పారు. అంతకుముందు బీఆర్ఎస్‌లో ఉన్న భిక్షమయ్య ఆలేరు ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఉద్దేశంతో టికెట్ అవకాశం కోసం బీజేపీ గూటికి చేరారు. అయితే మార్చిలో రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎక్కడో ఒక చోట నుంచి అవకాశం కల్పిస్తానని భిక్షమయ్యగౌడ్‌కు అధినేత కేసీఆర్ మాటివ్వడంతో ఆయన తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా సామాజిక వర్గ సమీకరణల్లో భాగంగా పార్టీ అవసరాల దృష్ట్యా భిక్షమయ్యగౌడ్‌కు అవకాశం దక్కనుందన్న ప్రచారం సాగుతోంది.

మరికొందరు

ఇక జిల్లాకు చెందిన సీనియర్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఖాయమైందన్న ప్రచారం జరిగింది. అయితే చివరి నిమిషంలో దివంగత నేత ఎలిమినేటి మాధవరెడ్డి కుమారుడు ఎలిమినేటి సందీప్‌రెడ్డికి ఆ పదవి దక్కింది. దీంతో ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని, అప్పట్లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని చింతల వర్గీయులు చెబుతున్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు సమసిపోవడానికి ఒక ప్రయత్నంగా అధిష్టానం ఎవరికో ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చే అవకాశం లేకపోలేదని పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి తనకు మరోమారు అవకాశం కల్పించాలని మనసులో ఉన్న మాటను తన వర్గీయులతో అన్నట్లు తెలుస్తోంది. అయితే తనకంటే కూడా తన కుమారుడు వివేక్ రెడ్డి ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని కేసీఆర్‌ను కోరినట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ సంస్థాన్‌నారాయణపురానికి చెందిన కర్నె ప్రభాకర్, శాసన మండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

సామాజిక సమీకరణలపై లెక్కలు

ఎమ్మెల్సీ పదవి కోసం ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్న పలువురు బీఆర్ఎస్ నేతలు సామాజిక వర్గ సమీకరణలపైనా లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్ర యూనిట్‌గా ఎమ్మెల్సీ అభ్యర్థులను అధినేత ఎంపిక చేయనున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గ సమీకరణలు బలంగా పని చేయనున్నాయి. మార్చిలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ సామాజికవర్గానికి చెందిన స్థానం ఉంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బలమైన సామాజిక వర్గానికి అవకాశం లభించవచ్చని తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బీసీ గౌడ సామాజిక వర్గానికి ప్రాతినిథ్యం లేనందున ఆ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వచ్చన్న ప్రచారం జరుగుతోంది.